ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 8 అక్టోబరు 2024




## నిత్య పెళ్లి కొడుకు ఆటకట్టు

- ఇస్రోలో ఉద్యోగినంటూ నాలుగు పెళ్ళిళ్లు
- పెళ్లి కూతుళ్ల తరపు బంధువులకు రూ.కోటి టోకరా
- బాధితురాలి ఫిర్యాదుతో అరెస్టు చేసిన ఏలూరు పోలీసులు
- స్వస్థలం తిరుపతి జిల్లా.. ప్రస్తుతం మధిరలో నివాసం

6



తమ వంతు కోసం వేచి ఉన్న రోగులు



# నిలబడి.. తడబడి.. వడివడి..

### జిల్లా జనరల్ ఆస్పత్రిలో అల్లాడిన ఓపీ రోగులు

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. అనారోగ్య సమస్యలతో వైద్యం పొందేందుకు వచ్చిన వారు... ఆస్పత్రిలో నిర్వహణ వైఫల్యంతో సతమతం అవుతున్నారు. సోమవారం ఆస్పత్రిలో కనిపించిన దృశ్యాలే ఇందుకు సాక్ష్యం. సోమవారం ఓపీ (ఔట్ పేషెంట్) చీటీల కోసం నాలుగు వరుసల్లో రోగులు బారులు తీరారు. తమ వంతు కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. డాక్టర్ల వద్ద కూడా పరీక్షల కోసం నిరీక్షిస్తూ నీరసించి పోయారు. ఒక్కో విభాగంలో గంటల తరబడి నిల్చోవాల్సి రావడంతో ఓపిక లేక ఆస్పత్రి మెట్లపైన, నేలపైనా పడుకున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమ్మెల ఉండటంతో సమస్య మరింత జటిలమైంది. సోమవారం ఒక్క రోజే సుమారు 1600 మంది రోగులు నమోదు చేసుకున్నట్టు చెబుతున్నారు. రోగులకు తగి నట్లుగా ఆస్పత్రి అధికారులు సౌకర్యాలు ఏర్పాట్లు చేయడంలేదని విమర్శలు వస్తున్నాయి. పోర్టికో వద్ద ఏర్పాటు చేసిన మంచినీళ్ల ట్యాంకు కూడా పనిచేయక పోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఆయా విభాగాల్లో రోగులను పరీక్షించడంలో వైద్యులు, సిబ్బంది అలక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యం కోసం వచ్చే రోగులకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

-ఖమ్మం కలెక్టరేట్


జిల్లా జనరల్ ఆస్పత్రిలో బారులు తీరిన రోగులు

## నేడు డిప్యూటీ సీఎం రాక

### అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో సమీక్ష



ఖమ్మం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ఉదయం 11 గంటలనుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. వరద నష్ట సహాయ కార్యక్రమాలు, సోషల్ వెల్ఫేర్, 3గంటలనుంచి 5గంటల వరకు ఎస్పీడీసీఎల్ ఖమ్మం, వరంగల్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

## నేడు పొంగులేటి పర్యటన




ఖమ్మం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు పాలేరు రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదల, 12:15గంటలకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, 2 గంటలకు తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనం శంకుస్థాపన, 2:45 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, సాయంత్రం 5 గంటలకు తల్లాడ మండలం ముద్దునూరులో పర్యటిస్తారు. 6 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలకు హాజరుకానున్నారని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## 'ట్రెజరీ' డీడీగా నర్సింహం



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 7: జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎస్వీఎస్ నర్సింహం సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వెంటపల్లి సత్యనారాయణ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఎఫ్ఏసీగా ఇక్కడ విధులు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో ఎస్వీఎస్ నర్సింహాన్ని ఖమ్మం జిల్లా డీడీగా నియమిస్తూ ట్రెజరీ అకౌంట్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సుల్తానీయా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం డీడీగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పూర్వ డీడీ వెంటపల్లి సత్యనారాయణ బాధ్యతలు అప్పగించారు. నూతన డీడీని కార్యాలయం ఏటీవో మోదుగు వేలాద్రి, కొమరగిరి దుర్గాప్రసాద్, కంచి శ్రీనివాస్, ప్రసన్నకుమార్, కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు.




కూరగాయల ధరలు కొండెక్కి చుక్కలు చూపిస్తున్నాయి. సామాన్యుడి వంటగదిలో కూరలు ఉడకకుండానే కుతకుతమంటున్నాయి. నగరంలోని రైతుబజార్లు, బహిరంగ మార్కెట్లలో కూరగాయలను ముట్టుకుంటే మంట పుడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన అధిక వర్షాలకు కూరగాయల పంట దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. గత ఆగస్టులో కూరగాయల ధరలు అదుపులోకి వచ్చి కొంత తక్కువ ధరలకు దొరుకుతున్నాయన్న సంతోషం కొద్ది రోజులు కూడా లేకుండా పోయింది.

# వెజ్‌ట్రబుల్స్

### మండుతున్న కూరగాయల ధరలు

- రూ.80కి చేరిన కిలో టమోటా రేటు
- ఏ రకం కూరగాయలైనా కిలో రూ.60పైనే
- బెంబేలెత్తుతున్న సామాన్యులు..
- వర్షాలతో తగ్గిన దిగుబడి
- డిమాండ్‌కు సరపడా లేని సరఫరా



ఖమ్మం మార్కెట్, అక్టోబరు 7: సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీవర్షాల దెబ్బకు మళ్లీ ధరలు పెరిగాయి. వర్షాల కారణంగా పంట పూర్తిగా కోల్పోగా ఉన్న కాస్త పంట దెబ్బతిని దిగుబడి తగ్గి డిమాండ్‌కు తగిన సరఫరా లేక ధరలు కొండెక్కాయి. గత ఆగస్టులో కిలో టమోటా రూ.20 నుంచి రూ.24, కిలో పచ్చి మిర్చి రూ.20, కిలో బీరకాయ రూ.30 వరకు ఉన్నాయి. అలాంటి టమోటా ధరలు మళ్లీ పెరిగి ప్రస్తుతం కిలో రూ.76 నుంచి రూ.80, వంకాయ కిలో రూ.60 నుంచి 70, బెండకాయ రూ.40 నుంచి రూ.50, బీరకాయ రూ.50 నుంచి రూ.60 పొట్లకాయ కిలో రూ.60 నుంచి రూ.70, నాటు చిక్కుడు కిలో రూ.140 నుంచి రూ.150కు చేరింది. దీంతో వినియోగదారుడిపై అధికధరల భారం పడింది. మార్కెట్లలో టమోటానే కాకుండా ప్రతి కూరగాయ ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో కిలో రూ.20లోపు లభించే కూరగాయలు ప్రస్తుతం కిలో రూ.60 నుంచి రూ.70కి పెరిగాయి. గతంలో రూ.పదికి 3 ఆకుకూరల కట్టలు లభించేవి. ఇప్పుడు రూ.20కు 3 ఆకుకూరల కట్టలు మాత్రమే ఇస్తున్నారు.

వారం రోజుల నుంచి నగరంలోని రైతుబజార్లు, బహిరంగ కూరగాయల మార్కెట్లలో కూరగాయల ధరలు పెరుగుతుండటంతో సామాన్యుడు కూరగాయలు కొనాలంటేనే బెంబేలెత్తుతున్నాడు. రోజు రోజుకూ కూరగాయల ధరలు పెరుగుతూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలనుంచే కాకుండా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో రవాణా చార్జీల భారం పెరిగి ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

**బహిరంగ మార్కెట్, రైతుబజార్‌లో ధరలు ఇలా...**

| కూరగాయలు (కిలో) | ధర |
|---|---|
| టమాటా | రూ. 76-80 |
| బీరకాయ | రూ. 50-60 |
| పచ్చిమిర్చి | రూ. 40-50 |
| కాకరకాయ | రూ. 40- 50 |
| వంకాయ | రూ. 56-60 |
| బెండకాయ | రూ. 40-50 |
| పొట్లకాయ | రూ. 60-70 |
| చిక్కుడు | రూ. 70-80 |
| నాటుచిక్కుడు | రూ. 140-150 |
| బోడ కాకర | రూ. 120 |
| దోసకాయ | రూ. 45-50 |
| గోరుచిక్కుడు | రూ. 50-60 |
| క్యాబేజీ | రూ. 30-40 |
| దొండ | రూ. 54-60 |
| సొరకాయ | రూ. 50-60 |
| మునక్కాయ ఒక్కటి | రూ. 15-20 |
| క్యారెట్ | రూ. 55-60 |
| క్యాప్సికం | రూ. 74-80 |
| ఆలుగడ్డ | రూ. 40-45 |
| ఉల్లిగడ్డ | రూ. 60-70 |
| కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు) | రూ. 160- 170 |
| కొత్తిమీర కట్ట | రూ. 40-50 |



**అరకొర సంపాదనలో అధిక భాగం కూరగాయలకే ఖర్చు : సరళ, గృహిణి, కరుణగిరి**

రెక్కాడితే గాని డొక్కాడని మాలాంటి వారికి రోజు మొత్తం కూలి చేస్తే వచ్చే పైసల్లో ఎక్కువగా కూరగాయల కొనుగోలుకే ఖర్చు చేయాల్సి వస్తోంది. కూరలు కొనాలంటేనే భయమేస్తోంది. కూరగాయలతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. ఏడాది క్రితంతో పోల్చుకుంటే అన్ని వస్తువుల ధరలు రెట్టింపయ్యాయి. పాలకులు నిత్యావసరాల ధరలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి.

## మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి...

- ఎన్నికల్లో మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- హక్కుల కోసం మహిళలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి
- నగరంలో 12వ ఐద్వా జిల్లా మహాసభ

6



ఖమ్మంలో ఐద్వా మహాసభలో పతాక ఆవిష్కరణ దృశ్యం

## శవమై కనిపించిన కట్టా ప్రసాద్

### సాగర్ కాలువ ఘటనలో మూడో మృతదేహం లభ్యం

ఖమ్మం క్రైం, అక్టోబరు 7: సాగర్ కాలువలో ఇటీవల గల్లంతైన ముగ్గురిలో మూడో మృతదేహం సోమవారం ఉదయం నగర శివారులో సాగర్ కాలువలో లభ్య మైంది. ఓ కేసులో ఉన్న వ్యక్తిని ములాఖత్ అయ్యేం దుకు పాత మణుగురుకు చెందిన బండారు భరత్(30), చల్లా రమేష్(38), కట్టా ప్రసాద్(27) గత నెల 30న నగర శివారులోని జిల్లా జైలుకు వచ్చి ఈనెల 1న సాగర్ కాలవలో గల్లంతైన ఘటనలో బండారు భరత్, చల్లా రమేష్‌ల మృతదేహాలు లభ్యం కాగా, మూడో వ్యక్తి కట్టా ప్రసాద్ మృతదేహం వారం తరువాత సోమవారం ఉదయం నగర శివారులోని గోపాలపురం లాక్‌ల వద్ద లభ్యమైంది. మృతదేహన్ని మార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కట్టా ప్రసాద్

## డీఎస్సీలో 'స్థానికత' గందరగోళం



- భద్రాద్రి జిల్లాలో విలీన మండలాల అభ్యర్థులకు సమస్య
- రాష్ట్ర విభజనతో నాన్ లోకల్‌గా పరిగణిస్తున్న అధికారులు
- పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం
- ప్రభుత్వం న్యాయం చేయాలంటున్న అభ్యర్థులు

6

## బడి కట్టించిన పోలీసులు


గ్రామస్థులు, విద్యార్థులతో ఎస్పీ

- చర్ల సీఐ, ఎస్ఐని అభినందించిన ఎస్పీ రోహిత్‌రాజు
- బూరుగుపాడు అటవీగ్రామంలో పోలీసుల ఆదర్శం
- లొంగిపోయిన నక్సల్స్‌కు చెక్కులు

చర్ల, అక్టోబరు 7: బడి అధ్వాన స్థితిని చూసి చలించిపోయి, సొంత ఖర్చుతో నూతన పాఠశాల నిర్మాణం చేయడం అభినందనీయమని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్ కొనియాడారు. సోమవారం చర్ల మండలం బూరుగుపాడు గ్రామంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి సొంత ఖర్చులతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. బూరుగుపాడు పాఠశాల పూరిపాకలో నడుస్తుందన్నారు. గ్రామానికి వచ్చిన సీఐ పాఠశాలను చూసి, కొత్త పాఠశాలను నిర్మించారన్నారు. గిరిజనులకు మెరుగైన విద్య అందించేందుకు పాఠశాలను కట్టించడం చాలా సంతోషకరమన్నారు. మావోయిస్టుల కారణంతో ఈ గ్రామం అభివృద్ధి చెందడం లేదన్నారు. అలాంటి వారికి ఎవరూ సహకరించవద్దని హెచ్చరించారు. అనంతరం సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి మాట్లాడుతూ, పాఠశాలను కట్టించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమంగా పాఠశాలకు పంపించాలన్నారు. అనంతరం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నోట్ బుక్స్, పండ్లు, స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు వీరస్వామి, విద్యార్థులు, స్థానికులు ఉన్నారు.

**లొంగిపోయిన నక్సల్స్‌కు చెక్కుల పంపిణీ**

ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం జిల్లాలో లొంగిపోయిన ఐదుగురు మాజీ మావోయిస్టు సభ్యులకు ప్రభుత్వం పునరావాసం కింద అందజేసిన చెక్కులను చర్ల స్టేషన్‌లో అందజేశారు. వీరిలో మడివి సోమమ్మ (4లక్షలు) మడకం లింగా (రూ.4లక్షలు), మడివి భద్రయ్య (రూ.4లక్షలు), కట్టం బొజ్జయ్య (రూ.40 వేలు) కుల్ము బుద్ర (రూ.20వేలు) తదితరులు ఉన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ సాయిమనోహర్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


వాగులో గాలిస్తున్న రెవెన్యూ, పోలీస్, ఫైర్ సిబ్బంది, గ్రామస్థులు (ఫైల్)

## వరద మింగిన బతుకులు

- ప్రవాహాల్లో గల్లంతైన పలువురు వ్యక్తులు
- ఏళ్లు గడుస్తున్నా లభ్యంకాని మృతదేహాలు
- డెత్ సర్టిఫికెట్‌కు అడ్డు వస్తున్న నిబంధనలు
- ఏడేళ్లు గడిస్తే కాని ధ్రువీకరణ సాధ్యంకాదంటున్న అధికారులు
- దూరమైన ప్రభుత్వ సాయం

ఆళ్లపల్లి, అక్టోబరు 7: ఏళ్లు గడుస్తున్నప్పటికీ వర్షాకాలం వరదల్లో గల్లంతైన వ్యక్తుల ఆచూకీ నేటికి లభించలేదు. కనీసం శవం కూడా దొరకకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు వారి జ్ఞాపకాలు తలుచుకుంటు రోదిస్తున్నారు. మరణ ధ్రువీకరణకు ఏడేళ్లు అనర్హులుగా గుర్తించడంతో ఆయా కుటుంబాలకు మరో బాధను మిగిల్చింది. ప్రమాదవశాత్తు వరదల్లో గల్లంతై మృతి చెందితే పోస్టుమార్టం నిర్వహించి, డెత్‌సర్టిఫికెట్ ద్వారా వారికి రావాల్సిన సదుపాయాలు కల్పిస్తుంది. కాగా వరదల్లో మృతదేహాలు లభ్యంకాని కుటుంబాలకు నిబంధనలు అడ్డురావడంతో వారికి ఏ రూపంలో సహాయం చేస్తుందన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

**లభ్యంకాని మృతదేహాలు..**

ఆళ్లపల్లి మండలంలోని బోడాయికుంట గ్రామానికి చెందిన ఏదుళ్ల లక్ష్మయ్య(లింగయ్య) 13జూలై 2020న మర్కోడుకు వచ్చి ఇంటికి వెళుతున్న క్రమంలో చింతలపడి వాగువరదలో గల్లంతయ్యాడు. అధికారులు లక్ష్మయ్య ఆచూకి కోసం జల్లేరు, కిన్నెరసాని, బంగారుచెలుక, తిప్పగుట్ట, కిన్నెరసాని ప్రాజెక్ట్ వరకు వారం రోజులు గాలించారు. కుటుంబసభ్యులు రెండు వారాల తరువాత లక్ష్మయ్య చనిపోయి ఉంటాడని భావించి దశదిన కర్మలు పూర్తి చేశారు. ముత్తాపురం గ్రామానికి చెందిన చాట్ల బుచ్చయ్య అనే వ్యక్తి 29 జూలై 2023న కిన్నెరసానివాగు దాటుతుండగా వరదలో గల్లంతయ్యాడు. అధికారులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికి ఆచూకి దొరకలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు బుచ్చయ్య చనిపోయి ఉంటాడని భావించి దిశదిన కర్మలు పూర్తి చేశారు.

**ప్రభుత్వ సాయానికి దూరం..**

ఏళ్ల గడుస్తున్నపట్టికి వరదల్లో గల్లంతైన వారికి సంబంధించి ధ్రువీకరణ లేకపోవడంతో ప్రభుత్వ సాయం అందడం లేదు. భార్య పింఛన్ పొందాలన్నా, రైతుబీమా, ఇతర ఇన్సురెన్సుల్లో వచ్చే ఆర్థిక లావాదేవీలు పొందాలన్నా మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే వరదల్లో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభిస్తేనే అధికారులు చనిపోయినట్లుగా ధ్రువీకరిస్తారు. మృతదేహం లభించకపోతే ఏడేళ్ల వరకు డెత్ సర్టిఫికేట్ జారీ చేసే పరిస్థితి లేదు. గల్లంతైన ఘటనలకు అధికారులు సాక్షంగా నిలిచినా నిబంధనలు అడ్డురావడంతో ఆ కుటుంబాలకు ఎలాంటి సాయం అందడం లేదు.

**ప్రజా ప్రభుత్వమైనా ఆదుకునేనా..**

కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా వరదల్లో గల్లంతైన వారి శవాలు లభ్యం అవ్వకపోవడంతో, అటువారికి డేత్‌సర్టిఫికెట్ జారీలో ప్రభుత్వం నిబంధనలు అడ్డువస్తున్నాయి. దాంతో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలకు దూరం అవుతున్నారు. వరదల్లో గల్లంతై మృతదేహాలు లభ్యమవ్వని వారికి ప్రత్యేకంగా గుర్తించి షరతులు లేకుండా ఆర్థిక సహాయం, ప్రభుత్వ పథకాలు, ఇతర సదుపాయలు వర్తించే విధంగా, ఆదుకోవాలని భద్రాది కొత్తగూడెం జిల్లాలో వరదల్లో గల్లంతైన వ్యక్తుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కిన్నెరసానివాగు వద్ద గాలింపును పరిశీలిస్తున్న జిల్లా అధికారులు(ఫైల్)

అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి: భద్రాద్రి కలెక్టర్ 7

# రైతులను మోసగించిన రాష్ట్ర సర్కార్

- కేంద్రం నిధులతో సోకులు
- హామీలు నెరవేర్చే వరకు ఉద్యమాలు
- బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూదన్‌రెడ్డి


సభ్యత్వం అందజేస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చ జాతీయ కార్యదర్శి మధుసుధన్‌రెడ్డి

జూలూరుపాడు, అక్టోబరు 7: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఇన్‌చార్జ్ గోలి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జూలూరుపాడులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు నున్నా రమేష్ గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీని అర్హులైన రైతులందరికీ వర్తింప చేయకుండా ప్రభుత్వం కేవలం 20శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ చేసిందని, రైతులకు రూ.15వేల రైతు భరోసాను అందించకుండా అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యక్షంగా ఎకరానికి రూ.18,500ల నగదు, ఎరువులపై సబ్సిడీ అందించడంతోపాటు, ధాన్యానికి క్వింటా రూ.2300లు, పత్తికి రూ.7500ల మద్దతు ధరను అందిస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం సోకులు చేస్తుందని విమర్శించారు. ఒక్క పైసా నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. పసల్ భీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలంలోనే ఆ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో దేవాదాయశాఖ జాయింట్ కన్వీనర్ సుదర్శన్‌ప్రసాద్ తివారి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, పార్టీ అసెంబ్లీ వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, నాయకులు నరసింహారావు, కార్తీక్, సిరిపురపు ప్రసాద్, రమేష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



# డీఎస్సీలో... స్థానికత గందరగోళం

- విలీన మండలాల అభ్యర్థులకు సమస్య
- మూతపడిన అభ్యర్థులు చదివిన పాఠశాలలు
- బాలికల పాఠశాలల్లో మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యం
- ఎక్కువ పోస్టులకు ఎంపికైతే వారి ఇష్టానికే అవకాశం..
- ఖాళీ పోస్టుల్లో మెరిట్ ప్రాతిపదిక
- దసరా తర్వాత బడులకు కొత్త ఉపాధ్యాయులు

డీఎస్సీలో-2024లో 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తైన అభ్యర్థుల్లో కొందరిని స్థానికతను నిరూపించేందుకు ధ్రువపత్రాలు సమర్పించాలని అధికారులు తెలియజేయడం గందరగోళానికి దారితీసింది. అభ్యర్థులు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఏ ప్రాంతంలో వరుసగా 4సంవత్సరాలు చదివి ఉంటారో ఆ జిల్లాను స్థానికతగా పరిగణిస్తారు. ఉన్నత చదువుల నిమిత్తం ఎక్కడెక్కడో చదివిన వారంతా తాము ఇదే జిల్లా వాసులమని పరీక్షలు రాశారు. కొందరు అభ్యర్థులు గతంలో చదివిన పాఠశాలలకు గుర్తింపు లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి పరీక్షలకు హాజరయ్యారు. 40ఏళ్ల పైబడిన అభ్యర్థులు చదివిన స్కూల్స్ ప్రస్తుతం లేవు. స్కూల్స్‌కు అనుమతులు ఉంటే సర్టిఫికెట్ అప్రూవల్ చేస్తున్నారు.

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 7: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విలీన మండలాల్లో చదివిన అభ్యర్థులు జిల్లా మార్పుతో పాటు రాష్ట్రం మారడంతో నాన్‌లోకల్‌గా పరిగణిస్తున్నారు. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వరరామచంద్రాపురం (వీఆర్ పురం)లో 1 నుంచి 4తరగతులు, ఏన్కూర్ గురుకులంలో 5 నుంచి 10 వరకు విద్యనభ్యసించి అభ్యర్థి కుటుంబం భద్రాచలంలో స్థిర పడి ఉన్నారు. లోకల్ ఏరియా కింద జిల్లాలో దరఖాస్తు చేశారు. చదువుకున్న అభ్యర్థి వివరాలు ఉమ్మడి జిల్లాలో ఉండటంతో భద్రాద్రి జిల్లాలో నాన్ లోకల్ కేటగిరి రిజర్వ్ చేశామని అధికారులు తెలిపారు.

**స్థానికత సర్టిఫికెట్‌కు ప్రాధాన్యం...**

స్థానికతపై అధికారులను వివరణ కోరగా.. 2015 నుంచి 10వ తరగతిలో ఫార్మెటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ విధానం అమలులో ఉంది. విద్యార్థి దేశంలో ఎక్కడ చదివిందీ ఆన్‌లైనలో తెలుస్తుంది. భద్రాద్రి జిల్లాలో తొలిసారి డీఎస్సీ ద్వారా నియామకాలు చేపడుతుండటంతో ఇతర ప్రాంతాల్లో చదివిన అభ్యర్థులు, వెరిఫికేషన్‌లో పాఠశాలలకు గుర్తింపు లేనివారిని రెసిడెన్స్ సర్టిఫికెట్ ఇస్తే లోకల్ కేటాగిరిలో నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**95శాతం స్థానికులకే..**

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు ఆయా జిల్లాలకు చెందిన స్థానికులకు 95శాతం పోస్టుల్లో భర్తీ చేస్తున్నారు. మిగిలిన 5శాతం ఖాళీలను ఓపెన్ విభాగంలో భర్తీ చేస్తారు. ఖాళీల్లో స్థానిక అభ్యర్థులతో పాటు స్థానికేతరులకు మెరిట్ ప్రాతిపదికన ఎంపికచేయనున్నారు. అభ్యర్థులు సాధించిన మెరిట్ ద్వారా ఒకే అభ్యర్థి ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైతే వారి కి ఆసక్తి ఉన్న పోస్టును ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

**మెరిట్ ప్రాతిపదికన భర్తీ**

జిల్లాలో సుమారు 60మంది అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికయ్యారు. శనివారం సాయంత్రం నుంచి వీరికి ఫోన్ చేసి వెరిఫికేషన్ కేంద్రానికి పిలిపించి రాత పూర్వకంగా లేఖలు తీసుకుంటున్నారు.

శనివారం రాత్రి 11గంటల వరకు ఆన్‌లైన్ ప్రక్రియను మొబైల్ డేటాతో నమోదుచేయడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం నుంచి సింగరేణి పాఠశాలకు వచ్చిన అభ్యర్థి ఎంపిక చేసుకున్న పోస్టును మినహాయించి.. ఆ అభ్యర్థి ఎంపికైన ఇతర విభాగాల పోస్టుల నుంచి పేరును తొలగిస్తున్నారు. ఈ విధానం అమలుతో ఖాళీలు మిగిలిపోయే అవకాశం లేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

తర్వాత మెరిట్ అభ్యర్థులతో ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయనున్నారు. నోటీస్ బోర్డులో వివరాల ఆధారంగా ఎంపికైన అభ్యర్థుకు పాఠశాలలు కేటాయించే సమయంలో అభ్యర్థి సాధించిన మార్కులను పరిగణలోకి ర్యాంకులు కేటాయించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. అందుబాటులో ఉన్న ఖాళీల ప్రకారం ఎంపిక చేసుకున్న పాఠశాలలకు వారికి నియామక పత్రాలు అందజేస్తారు. బాలికల పాఠశాలల్లో మహిళా అభ్యర్థులు అందుబాటులో ఉంటే వారితోనే భర్తీ చేయాలనే నిబంధన పెట్టారు. దసరా సెలవుల తరువాత కొత్త ఉపాధ్యాయులు కొలువు దీరనున్నారు.

**9న నియామక పత్రాలు..**

దసరా సెలవు నేపథ్యంలో అక్టోబరు 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తవ్వటంతో అర్హులైన వారిని ఎంపిక చేసి ఈనెల 9న నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరి పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో చాలామంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ఎస్ఏలుగా పదోన్నతి పొందడంతో స్కూల్స్‌లో ఖాళీలు ఏర్పడ్డాయి. కొత్త ఉపాధ్యాయులతో కొరత తీరనుంది. 2008 డీఎస్సీ లో ఉద్యోగాలకు అర్హత సాధించి పలు కారణాలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించే ప్రక్రియ చేపడుతుంది.


విజేతగా నిలిచిన ఖమ్మం జట్టు క్రీడాకారులు

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ విజేత ఖమ్మం

చుంచుపల్లి, అక్టోబరు 7: చుంచుపల్లి ప్రకాశం స్టేడియంలో గత మూడు రోజులుగా సాగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫుడ్ బాల్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో ప్రథమ విజేతగా ఖమ్మం జట్టు నల్గొండపై 1-0 తేడాతో గెలవగా, ద్వితీయ స్థానం నల్గొండకు దక్కింది. 3, 4 స్థానాలకు జరిగిన పోరులో రంగారెడ్డి జిల్లా జట్టు మెదక్ జట్టుపై 1-0 గోల్స్ సాధించి తృతీయ స్థానాన్ని సాధించింది. విజేత జట్లకు బహుమతులను రాష్ట్ర ఫుడ్ బాల్ పరిశీలకులు వడెన్న అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్, ఖదీర్, మంజీలాల్, మదన్మోహన్, కృష్ణా, రాము, యుగంధర్, శ్రీనివాస్, సుందరమ్మ, సీతాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు

# సిబ్బంది భర్తీ, వైద్య పరికరాలకు ప్రతిపాదనలివ్వండి

- మూడు జిల్లాల మెడికల్ ఆఫీసర్ల సమీక్షలో పీవో రాహుల్


సమీక్ష నిర్వహిస్తున్న పీవో

భద్రాచలం, అక్టోబరు 7: ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వివిధ పీహెచ్‌సీల్లో వైద్యులు, గైనకాలజిస్టుల భర్తీ, వైద్య పరికరాలకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తమ నివాస ప్రాంతాల నుంచి అరగంటలోనే ఆసుపత్రికి చేరుకోవడానికి పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లో వైద్యులు, సిబ్బందికి అవసరమైన చోట బైక్ అంబులెన్సుల ద్వారా మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేయలన్నారు. ఐటీడీఏ పరిధిలోని వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, పీవీటీజీ గిరిజనులకు ప్రత్యేక వార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలందజేయాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లోని గర్భిణులను ప్రసవ వేదనకు ముందే పీహెచ్‌సీలకు తరలించడానికి 108 వెళ్లలేని గ్రామాలకు బైక్ అంబులెన్సు ద్వారా తరలించే విధంగా చూడాలని అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పొందుపరచాలన్నారు. ప్రస్తుతం మనకు టీహబ్ కొత్తగూడెంలో ఉందని, భద్రాచలానికి మినీ టీ హబ్ ఏర్పాటలుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. త్వరలోనే ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో అన్ని రకాల స్పెషలిస్టులచేత మెడికల్ క్యాంపు నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మెడికల్ ఆఫీసర్లు మెడికల్ క్యాంపుల్లో పాల్గొని గిరిజనులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కర్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ చైతన్య, వివిధ సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల నుంచి వైద్యులు పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్లకు నాలుగు నెలల వేతనాలు

- నిరాహారదీక్షలు వాయిదా వేసిన సీఐటీయూ

భద్రాచలం, అక్టోబరు 7: గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టల్ వర్కర్లకు రావలసిన వేతన బకాయిల్లో నాలుగు నెలల వేతనం చెల్లించేందుకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ అంగీకరించారు. సోమవారం ఐటీడీఏ పీవోను సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్టల్ వర్కర్లు కలిసి వర్కర్ల సమస్యలపై చర్చించారు. పీవో హామీతో హాస్టల్ వర్కర్లు తలపెట్టిన ఆకలికేక దీక్షలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. పీవో సానుకూలంగా స్పందించడంతో పాటు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శితో కూడా మాట్లాడి సమస్యలను వివరించారని సీఐటీయూ నాయకుడు బ్రహ్మచారి తెలిపారు. ఇప్పటి వరకు చెల్లించిన వేతనాల పూర్తి వివరాలను పీవోకు అందజేశామని గాడ్స్ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లింపులు జరిగిన కాలంలో కార్మికులకు పీఎఫ్ డబ్బులు జమకాలేదని ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్లు, యూనియన్ నాయకులు రమ, తిరుపతమ్మ, జయ, జలందర్, స్వరూప, సుభద్ర, అన్వర్, లక్ష్మి పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు ఆరో విడత కౌన్సెలింగ్

చుంచుపల్లి, అక్టోబరు 7: 2024 ఏడాదికిగాను రాష్ట్రంలో 25 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ఆరు కొత్త కోర్సులలో ప్రత్యేక ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్టు రుద్రంపూర్ ఐటీఐ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ఆరవ విడత కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు గతంలో ఆన్‌లైన్ చేసిన వారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలను సంప్రదించాలని సూచించారు.

# మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి...

- ఎన్నికలో మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- హక్కులకోసం మహిళలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి
- నగరంలో 12వ ఐద్వా జిల్లా మహాసభ



ఐద్వా జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

ఖమ్మంటౌన్, అక్టోబరు 7: మహిళలకు మోదీ ప్రభుత్వ తక్షణమే 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2500 వెంటనే ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం 12వ ఐద్వా జిల్లా మహాసభ నగరంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌లో తొలి ఐద్వా కార్యదర్శి ఏపూరి జయమ్మ ఐద్వా జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ ప్రదర్శన నిర్వహించారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, మెరుగు రమణ, మెహరున్నీసాబేగం, అధ్యక్షవర్గంగా జిల్లావ్యాప్తంగా ఎంపికైన ప్రతినిధులతో మహాసభ నిర్వహించారు.

ఈ మహాసభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారిత గురించి పాలకులు మాటలు చెప్పటమే చేస్తున్నారని, ఆచరణలో పెట్టడం లేదన్నారు. మహిళలు తమ హక్కులకోసం సమరశీల పోరాటాలకు సిదజితం కావాలని పిలుపునిచ్చారు. మోదీ ఆధ్వర్యంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారికత, 33శాతం రిజర్వేషన్ల అమలు గురించి మాటలు చెబుతే కాలాయాపన చేస్తున్నదని విమర్శించారు. మహిళలకు హక్కులు కల్పించటంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి నేటివరకు అమలు చేయలేదన్నారు.

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమ హక్కుల సాధనకోసం, సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మహిళాశక్తి తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం ఈ మహాసభలో ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి గత మూడేళ్లగా జిల్లాలో ఐద్వా చేసిన పోరాటాలను, భవిష్యత్ కర్తవ్యాలను, ఉద్యమ నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో జిల్లానేతలు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా, నాగ సులోచన, ప్రభావతి, కృష్ణవేణి, అమరావతి, రమ్య, జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సన్న ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక కేంద్రాలు

- మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తాలుపేరుతో కోత విధించకూడదు
- కేంద్రాల్లోనే ధాన్యం నాణ్యత పరిశీలించి పంపాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష



ఖమ్మం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని సూచించారు. మద్దతు ధరపై ధాన్యాన్ని కొనుగోలుచేసిన 48 గంటల్లోనే రైతులకు సొమ్ములు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500బోనస్ ప్రకటించిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా రైతులు ధాన్యం తెచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ విస్తరణాధికారులు గ్రామాల వారీగా సన్నరకం ధాన్యం ధ్రువీకరణ చేసి కొనుగోలు కేంద్రాలకు మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో సన్నరకం, దొడ్డురకం ధాన్యం దిగుబడి అంచనాలు బుధవారం నాటికి అందించాలని సూచించారు. సన్నరకం, దొడ్డు రకానికి వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో కేంద్రానికి మండలస్థాయి అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించాలని సూచించారు. ఆయా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, రైతులకు అవసరమైన సౌకర్యాలు, ఖాళీస్థలం, వేయింగ్ యంత్రాలు, తేమయంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాల్స్, గన్నీసంచులు అన్ని చోట్ల అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి రోజూ మండల అధికారులు కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్నీ సంచులకు ట్యాగ్ ఏర్పాటుచేసి దానిపై సెంటర్ నెంబర్ వేయాలని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం మిల్లులకు వచ్చిన తరువాత మిల్లర్లు తాలు పేరుతో ఎట్టిపరిస్థితుల్లో తూకంలో కోత విధించడానికి వీల్లేదన్నారు. ధాన్యం నాణ్యతను కొనుగోలు కేంద్రాల వద్దనే పరిశీలించి పంపాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమామీల కొరత లేకుండా చూడాలని, మండలంలో జరిగే ధాన్యం కొనుగోళ్లపై మండల ప్రత్యేక అధికారికి పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ యంత్రాలను పరీక్షించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు.

జిల్లా సరిహద్దుల నుంచి ఇతర ప్రాంతాల ధాన్యం రాకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, లైట్లు ఏర్పాటు, ఇతర సౌకర్యాలు కలిపించాలన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కలిపించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా లోపాలుంటే వెంటనే సవరించుకోవాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల స్పెషలాఫీసర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఐకేపీ కేంద్రాలు, తేమ యంత్రాల నాణ్యత పరిశీలించి సక్రమంగా లేకపోతే కొత్తయంత్రాల కొనుగోలుకు డీఆర్‌డీఏ ప్రతిపాదన చేయాలన్నారు. సహకార సంఘాలకు సంబంధించి కొనుగోలు కేంద్రాలకు 2 నుంచి 3ఎకరాల స్థలం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, అదనపు డీసీపీ ప్రసాదరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# నిత్య పెళ్లి కొడుకు ఆటకట్టు

- ఇస్రోలో ఉద్యోగినంటూ నాలుగు పెళ్లిళ్లు
- పెండ్లి కూతుళ్ల తరపు బంధువులకు రూ.కోటి టోకరా



నిందితుణ్ని చూపుతూ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 7: ఆన్‌లైన్‌లో మేట్రిమోన్ రిజిస్ట్రేషన్ చేసి ఆపై వచ్చిన యువతుల ప్రొఫైల్‌లోని ఫోన్ నెంబర్లను సేకరించి మాయమాటలతో నలుగురు యువతులను పెళ్లిచేసుకుని ఐదో యువతిని పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లాకు చెందిన ఆశం అనిల్‌బాబు అలియాస్ కల్యాణ్‌రెడ్డి (36) ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిరలోని టీచర్స్ కాలనీలో ఉంటున్నాడు. 9వ తరగతి వరకూ చదివి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ వచ్చిన డబ్బుతో అనుకున్న జీవితాన్ని గడపలేకపోవడంతో ఎక్కువ డబ్బు సంపాదించాలని ఆలోచించి తెలుగుభారత్ మేట్రిమోన్ వెబ్‌సైట్‌లో కల్యాణ్ అనే పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. పెళ్లి సంబంధాలు రాకపోవడంతో కల్యాణ్‌రెడ్డిగా రిజిస్టర్ చేసుకుని మేట్రిమోన్ వెబ్‌సైట్ ద్వారా వచ్చిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తాను కల్యాణ్‌రెడ్డి (అనిల్‌బాబు) తండ్రిని మాట్లాడుతున్నానని తమ కుమారుడు ఇస్రోలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నాడని తన భార్య కూడా ఇస్రోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ అని అల్లుడు, కూతురు అమెరికాలో ఉంటున్నారని తమకు వంద ఎకరాల వ్యవసాయభూమి రెండు విల్లాలు ఉన్నాయని నమ్మించి కట్న కానుల పట్టింపు లేదని అమ్మాయి నచ్చితే చాలని నమ్మబలికేవాడు. ఆ తరువాత అనిల్ అలియాస్ కల్యాణ్‌రెడ్డి నేరుగా పెళ్లిచూపులకు వెళ్లేవాడు. తమ తల్లిదండ్రులు రావడానికి సెలవు లేదని నమ్మించి పెళ్లి కూతురు నచ్చిందని వారి కుటుంబ సభ్యులు వివరాలు అడిగి తెలుసుకుని ఇస్రోలో తను హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాని, ఉద్యోగాలు ఇప్పిస్తానని సొమ్ములను తన అకౌంట్‌లోకి వేయించుకునేవాడు. హైదరాబాద్ శివారు చేవెళ్లలో ఒక ఫామ్‌హౌస్, బెంగళూరులో ఒక విల్లాను అద్దెకు తీసుకున్నాడు. హైదరాబాద్‌లో ఒక పీఏ, ఒక వాచ్‌మెన్, ఒక యువతి అసిస్టెంట్‌గా పెట్టుకుని ఇద్దరు బౌన్సర్లను కూడా పెట్టుకున్నాడు. ఇతనికి సలహాలు ఇవ్వడానికి కాశీ అనే వ్యక్తి పెళ్లి చేయడానికి కూడా పంతులను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ రకంగా నలుగురు యువతులను పెళ్లి చేసుకుని మోసగించాడు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన ఒక యువతికి పెళ్లి సంబంధం చూసే నిమిత్తం వెబ్‌సైట్లో వివరాలు పెట్టడంతో వెంటనే అనిల్‌బాబు ఇదే విధంగా వారితో సంభాషణలు కలిపి వారి కుమార్తెను పెళ్లి చేసుకుంటానని మూడో కుమార్తెకు ఇస్రోలో ఉద్యోగం ఇస్తానని నమ్మబలికి ఆన్‌లైన్ ద్వారా ఏకంగా 9 లక్షల 53 వేల రూపాయలు తీసుకుని మోసగించాడు. ఉద్యోగం ఇంటర్వ్యూ కోసం తన వద్ద పనిచేసే తుంగా శశాంక అనే యువతితో నకిలీ ఇంటర్వ్యూలు చేయించి ఉద్యోగానికి అపాయింట్‌మెంటు ఆర్డర్లను కూడా ఇస్తూ మోసగిస్తున్నాడు. బాధితులు మోసపోయామని గ్రహించి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు అనిల్‌బాబు అలియాస్ కల్యాణ్‌రెడ్డి, అతనికి సహకరించిన కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కాలమాల గ్రామానికి చెందిన తుంగా శశాంక (27) నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం బత్తులూరుపాడు గ్రామానికి చెందిన పల్లె హేమంత్‌రెడ్డిలను అరెస్టు చేశారు. వీరివద్ద నుంచి రెండు లక్షల రూపాయల నగదు, కారు, ఐదు ఫోన్లు, 13 సిమ్‌లు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్, అందుకు ఉపయోగించిన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు రెండు, బ్యాంక్ చెక్‌బుక్కులు, పలు డాక్యుమెంట్లను సీజ్ చేశారని చెప్పారు. ఈ కేసు ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని ఎస్పీ సూచించారు. ఇప్పటి వరకూ కోటిన్నర రూపాయల వరకూ మోసగించాడని ప్రాథమికంగా దర్యాప్తులో వెల్లడైందన్నారు. సమావేశంలో ఎస్పీతో పాటు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్‌లు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు



ఖమ్మం, ఖానాపురం హవేలి అక్టోబరు 7: జిల్లాలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు సోమవారం తెలిపారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గణితం 2, పొలిటికల్ సైన్స్ 2 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కల్లూరు కళాశాలలో గణితం, బనిగండ్లపాడు కళాశాలలో పొలిటికల్ సైన్స్, పెనుబల్లిలో గణితం, పొలిటికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటా ఫారంతో పాటు పది, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మార్కుల 10 తేదీలోగా నూతన కలెక్టరేట్ కార్యాలయంలోని ఇంటర్మీడియట్ జిల్లా కార్యాలయంలో మల్టీజోన్ వన్‌కు సంబంధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు అందించాలని తెలిపారు. పీజీ మార్కుల మెరిట్ ప్రకారం ఎంపికలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఖమ్మం.తెలంగాణ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని తెలిపారు.

## గ్రానైట్ రాయి మీద పడి కార్మికుడి మృతి

ఖమ్మం రూరల్, అక్టోబరు 7: గ్రానైట్ పరిశ్రమలో ప్రమాదవశాత్తు రాయి మీద పడి ఓ గ్రానైట్ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఖమ్మం రూరల్, మండలం వెంకటగిరి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బబ్లూకుమార్ (36) కొంత కాలంగా వెంకటగిరిలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. సోమవారం కటింగ్ మిషన్‌తో రాయిని కటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మీదపడి బబ్లూకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. జరిగిన సంఘటనపై మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రైం సమాచారం

## పశువుల అక్రమ రవాణాను అడ్డుకొన్న పోలీసులు

టేకులపల్లి, అక్టోబరు 7: బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర నుంచి హైదరాబాద్‌కు మినీవాహనంలో పశువులను అక్రమంగా తరలిస్తుండగా సోమవారం టేకులపల్లి పోలీసులు పట్టుకొన్నారు. టేకులపల్లి పోలీసులు సోమవారం పోలీసు స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మిని గూడ్స్ వాహనంలో కబేళాలకు తరలిస్తున్న 14 తెల్లపశువులను గుర్తించి పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్ తెలిపారు.

## అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి


జోగారావు (ఫైల్)

దుమ్ముగూడెం అక్టోబరు 7: మండలంలోని చిన్నార్లగూడెం జీపీ పాఠశాల ఉపాధ్యాయులు కొర్సా జోగారావు(51) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. కొద్ది రోజులుగా కిడ్నీ సంబందిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులో చికి త్స పొందుతుండగా పరిస్థితి విషమించింది. మంగళవారం కొత్తపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబీకులు తెలిపారు. జోగారావు అకాల మృతిపట్ల చిన్నార్లగూడెం పాఠశా ల హెచ్ఎం నాగేశ్వరావు, సిబ్బంది తమ సంతాపాన్ని తెలియజేశారు.

## 45కేజీల గంజాయి పట్టివేత

అశ్వాపురం అక్టోబరు 7: వాహనాల తనిఖీలో సోమవారం ఆటోలో అక్రమంగా తరలి స్తున్న 45 కేజీల గంజాయిని అశ్వాపురం పోలీసుల పట్టుకున్నారు. సంఘటనకు సం బందించిన వివరాలిలా ఉన్నాయి. అశ్వాపురం పోలీసులు గొల్లగూడెం వద్ద వాహనాల తనికీ నిర్వహిస్తుండగా ఓఆటో అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు ఆటోలో సో దాలు నిర్వహించగా భద్రాచలం నుంచి పెద్దపల్లి వెళ్తున్న ఆటోలో సుమారు 45కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయినట్టు,దాని విలువ రూ.50లక్షల వరకు ఉంటుందని పో లీసులు వెల్లడించారు. ఆటో డ్రైవర్ ఆకుల శివను అదుపులోకి తీసుకుని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గొడ్డలితో భార్యపై దాడి

అశ్వాపురం అక్టోబరు 7: భార్యపై అనుమానంతో భర్త గొడ్డలితో దాడి చేసిన సంఘ టన సోమవారం మండల పరిధిలోని గొందిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథ నం ప్రకారం గొందిగూడెం గ్రామానికి చెందిన కుర్సం సత్యవతి (30) కొంతకాలంగా అ శ్వాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కాంట్రాక్ట్ నర్స్‌గా పనిచేస్తోంది. ఈనేపథ్యంలో భ ర్త సురేష్ ఆమె పై అనుమానం పెంచుకున్నాడు. దీంతో భార్య, భర్తల మధ్య వివాదం జరుగుతోంది. సోమవారం వివాదం జరగటంతో సురేష్ గొడ్డలితో భార్యపై దాడికి పాల్ప డి కాలు,చేయి నరికాడు. స్థానికులు గమనించి 108 ద్వారా సత్యవతిని భద్రాచలం ఏరి యా ఆసుపత్రికి తరలించారు. అశ్వాపురం ఎస్ఐ తిరుపతిరావు నిందుతుడిని అదుపులో కి తీసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మానసిక ఒత్తిడితో యువతి బలవన్మరణం


సంకీర్తన (ఫైల్)

పినపాక, అక్టోబరు 7: బీటెక్ చదివి, పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, మానసిన ఒత్తిడికి లోనై, పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఓ యువతి ఆదివా రం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామ పంచాయతీ, రావిగూడెం ఎస్సీ కాలనీకి చెందిన కర్రి రాజు, జ్యోతిల కుమార్తె సంకీర్తన (24) బీటెక్ పూర్తిచేసింది. పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. ఇటీవల వెలుడిన ఏఈ ఫలితాల్లో క్వాలిఫై కాకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైంది. సదరు యువతి ఈ నెల 4 శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో, పురుగుల మందు సేవించి, ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు యువతి తల్లిదండ్రులకు సమాచారం అందించి, హుటాహుటిన పినపాక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మణుగూరు 100 పడకల ఆసుపత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. కాని పరిస్థితి మెరుగవకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించినప్పటికి పరిస్థితి విషమించి, ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందింది. యువతి మేనమామ బోడ లక్ష్మణ్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు, చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏడూళ్లబయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య

ఖమ్మం రూరల్, అక్టోబరు 7: ఉరివేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘ టన మండల పరిదిలోని నరసింహపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తల్లంపాడు పరిదిలోని నరసింహపురం గ్రామానికి చెందిన ఉపేందర్, సుజాత(28) భార్య, భర్తలు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉపేందర్ పనికి వెళ్లడ లేదని ఆదివారం రాత్రి భార్యభర్తలు ఘర్షణ పడ్డారు. ఘర్షణతో మనస్థాపం చెందిన సుజాత సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఖాన్‌ఖాన్‌పేట అలయంలో పంచలోహ విగ్రహాల చోరీ

కల్లూరు, అక్టోబరు 7: కల్లూరు పంచాయితీ పరిధిలో గల ఖాన్‌ఖాన్‌పేట గ్రామంలో గల ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి పంచలోహ ఉత్సవ విగ్రహాలను చోరి చేశారు. ఈ సంఘటనకు సంబంధంచి వివరాలు ఇలా ఉన్నాయి. ఖాన్‌ఖాన్‌పేటలో ప్రధాన రహదారి పక్కన గల శ్రీ సీతారామంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ గర్భగుడి తలుపు తాళాలు తొలిగించి ఉత్సవ మూర్తుల పంచలోహ విగ్రహాలు నాలుగు, అమ్మవారి మంగళ సూత్రలు, స్వామి వార్ల వెండి కళ్లు అపహరించారు. వాటి విలువ సూమారు రూ.50 లక్షలు ఉంటుందని ఆలయ కమిటి సభ్యులు ఫిర్యాదు చేయగా ఎస్ఐ షాకీర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనపై క్లూస్ టీం పరిశీలించి వేలిముద్రలు సేకరించారు.

## పొదల్లోకి దూసుకెళ్లిన వాహనం

తల్లాడ, అక్టోబరు 7: తల్లాడ ఎన్టీఆర్ కాలనీ సమీపంలో సోమవారం ఆగి ఉన్న లారీని ఢీకొని బొలోరా వాహనం అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. బొలోరా వాహనంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ బస్సుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తున్నారనే సమాచారంతో ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు వాహనంలో వచ్చి స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లో ఆర్టీసీ బస్సులను తనిఖీ చేశారు. తిరిగి సత్తుపల్లి వైపు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం ఎన్టీఆర్ కాలనీ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని స్వల్పంగా ఢీకొని అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు సురక్షితంగా బయటపడ్డారు. పొదల్లోకి దసుకెళ్లిన వాహనాన్ని ట్రాక్టర్ల సహాయంతో బయటకు తీశారు.

# అనుమతుల మాటున అక్రమ రవాణా

- అధిక లోడుతో ఇసుక లారీలు
- ఇతర మండలాల నుంచి రాత్రి తరలింపు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ ప్రజలు


అధిక లోడ్‌తో రాత్రి సమయంలో వెళ్తున్న ఇసుక లారీ

కరకగూడెం, అక్టోబరు 7: మండలంలోని కరకగూడెం ప్రధాన రహదారిపై అనుమతులు లేకుండా, అధిక లోడుతో ఇసుక లారీలు రాత్రి సమయంలో పెద్ద ఎత్తున వెళ్తున్నాయి. అధిక లోడుతో ప్రయాణం సాగిస్తుండటంతో ఆర్అండ్‌బీ రహదారి పాడైపోతుందని ఏజన్సీ ప్రజలు వాపోతున్నారు. మణుగూరు, పినపాక మండలాల నుంచి గోదావరి, పెద్దవాగుల నుంచి ఇసుక లారీలు వందల సంఖ్యలో ఏడూళ్లబయ్యా రం నుంచి కరకగూడెం మీదుగా తాడ్వాయి నుంచి హైదరాబాద్ ఇసుక తరలుతోంది. 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో నక్సల్ ప్రభావవిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు అయిన ఆర్అండ్‌బీ నిధుల నుంచి ఏడూళ్ళ బయ్యారం నుంచి కరకగూడెం మీదుగా ములుగు జిల్లా రంగాపురం భద్రాద్రి కొత్తగూడెం సరిహద్దు వరకు రహదారి నిర్మించారు. కానీ ఈ రహదారిపై అధికారులు తనిఖీలు లేక పోవడం.. పూర్తి ఏజెన్సీ గ్రామాలు అవడంతో అధిక లోడుతో లారీలు వెళ్తున్నాయి. ఇదే అదునుగా కొన్ని జీరో దందా ఇసుక లారీలు ఈ రహదారిపై వెళ్తున్నాయని ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. అధిక లోడ్‌తో, అక్రమంగా తరులుతున్న జీరో దందా లారీలు ఏజన్సీ గ్రామాలలో రాత్రి సమయంలో తరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో తరతిస్తున్న లారీలను, అనుమతుల మాటున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని ఈ రహదారి నుంచి లారీలను తరలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

**దినేష్, జిల్లా మైనింగ్ డీఈ**



అనుమతుల మాటున అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. రాత్రి సమయంలో అధిక లోడుతో పదుల సంఖ్యలో ఇసుక కరకగూడెం రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయంలో అధిక లోడుతో ఇసుక లారీలు తరలించవద్దు. అధిక లోడు, అనుమతుల మాటున అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు. మండలంలో ఇసుక లారీలపై ప్రత్యేక దృష్టి పెడతాం.

## ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలకు ఆహ్వానం: సీపీ



ఖమ్మంక్రైం, అక్టోబరు 7: పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఔత్సాహిక ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌కు సంబందించి రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి వారోత్సవాలు నిర్వహిమని, ఇందులో బాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటివల తీసిన 10+8 సైజ్ మూడు ఫోటోలు, మూడు నిమిషాల గల షార్ట్ ఫిలింను తీసి పెన్‌డ్రైవ్‌లో లోడ్ చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఈనెల 20లోపు కమిషనర్ కార్యాలయంలో పీఆర్‌వో కు అందజేయాలని పేర్కొన్నారు. ఈపోటీలకు నామినేషన్ పంపించే ఔత్సాహికులు అత్యవసర సమయాలలో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాలలో పోలీసుల సేవ, తదితర అంశాలకు సంబందించి గత సంవత్సరం అక్టోబరు నుంచి ఇప్పటి వరకు తీసిన ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాలని, పూర్తి వివరాలకు 8712659256 నెంబర్ సంప్రదించాలని సీపీ ప్రకటనలో కోరారు.

### 11న రెసిడెన్షియల్ భవనానికి

# డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన

- స్థలాన్ని పరిశీలించిన డీఈవో, ఆర్అండ్‌బీ ఈఈలు
- విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యేలా సన్నాహాలు


స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో, ఇతర అధికారులు

బోనకల్, అక్టోబరు 7: మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిదిలో గల 401 సర్వే నంబర్‌లో 25 ఎకరాల గల భూమిలో నూతనంగా నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి 11న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం డీఈవో సోమశేఖర శర్మ, సీఎంవో రాజశేఖర్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈవో దామాల పుల్లయ్య, ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్, తహసీల్దార్ పున్నం చందర్‌లు లక్ష్మీపురంలో స్థలాన్ని పరిశీలించారు. శంకుస్థాపనకు సంబంధించి పనులను పూర్తి చేసేందుకు సమాలోచనలు జరిపారు. మధిర నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో పైలట్ ప్రాజెక్టుగా అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విద్యాలయ భవన భూమి పూజకు మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఎంఈవో ఉపాధ్యాయులకు అత్యవసరంగా జూమ్ మీటింగ్ నిర్వహించి డిప్యూటీ సీఎం శంకుస్థాపన కార్యక్రమానికి తప్పని సరిగా హాజరు కావడంతో పాటు లక్ష్మీపురం సమీపంలో ఉన్న గ్రామాల్లో ఉన్న పాఠశాలల వారు విద్యా బ్యానర్లు ఏర్పాటు చేసి అక్కడ ప్రదర్శించాలని కోరారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే భట్టి కలల సౌధం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల సముదాయ భవన నిర్మాణ నమునా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఉండటంలో సందేహం లేదని మండల ప్రజలు భావిస్తున్నారు. మండలానికి మోడల్ రెసిడెన్షియల్ రావడంతో రోడ్లతో పాటు అన్ని అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తవుతాయని విద్యాధికులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

## ఆలయానికి రూ.1,11,116 విరాళం


నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాతలు

సత్తుపల్లి, అక్టోబరు 7: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన గుగులోతు భీముడు, సుజాత దంపతులు రూ.1,11,116నగదును విరాళంగా నిర్వహకులకు అందజేశారు. సోమవారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, సోమిశెట్టి శ్రీధర్, రాగాల చంద్రారెడ్డి, గాదె నాగు, రాగాల రమేష్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, దురిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్
- పర్ణశాలలో పూజలు
- ఆదివాసీ గ్రామాల్లో పర్యటన


ఆదివాసీలతో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్

దుమ్ముగూడెం, అక్టోబరు 7: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో ప్రసాద్ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనుల ను త్వరితగతిన పూర్తి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. తొలుత స్వామి వారిని దర్శించుకొని, సీతవాగు, నారచీరల ప్రాంతాల్ని సందర్శించారు. ఖాళీగా ఉన్న దేవస్థానం భూమిలో భక్తుల కు నీడనిచ్చే చెట్లను నాటి సంరక్షించాలన్నారు. ఔషద గుణాలున్న తులసి, తిప్పతీగ, మల్లేరు అశ్వగంధ లాంటి మొక్కలను నాటి భక్తులకు తెలిసేలా సమాచారాన్ని ప్రదర్శించాలన్నారు. బొజ్జుగుప్ప, పాతనారాయణరావుపేట ఆదివాసీ గ్రామాల్ని సందర్శించి ట్రైబల్ మ్యూజియం ఏర్పా టు, అభివృద్ధికి గల అవకాశాల్ని పరిశీలించారు. పర్యాట కులను ఆకర్షించేలా పురాతన కాలపు మట్టి గృహాల మాదిరిగా ఇళ్లను నిర్మించాలన్నారు. పొలం గట్లపై, ఇంటి పెరటిలో మునగ, జామ, ఇతర ఫలాలకు సంబంధించిన చెట్లను నాటి జీవనోపాది పొందాలని సూచించారు. తహసీ ల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో రామకృష్ణ, పర్ణశాల రామాలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆర్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### సమస్యలపై వినతిపత్రాలు

పలు సమస్యలపై పినారాయణరావుపేట ఆదివాసీలు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. నలభై ఏళ్లగా సాగుచేస్తున్న సర్వేనెం 58లో గల రెండు వందల ఎకరాల రెవెన్యూ భూమికి పట్టాలు ఇప్పించాలని కోరారు. చెక్‌డాం ఏర్పాటు చేయాలని, గిరివికాసం పథకంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లకు డీడీలు కట్టామని, కనక్షన్లు ఇప్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామపెద్దలు కూరం బొర్రయ్య, బాబూరావు, వెంకట్రాజు, వీరభద్రయ్య, జోగారావు, బాలకృష్ణ, నాగేంద్ర తదితరులున్నారు.

# నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల సీజ్: డీఎస్పీ అబ్దుల్ రహమాన్, ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ


మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ ఖమ్మం క్రైం, అక్టోబరు 7: నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై ఉక్కుపాదం మోపుతూ కొత్తగూడెం, ఖమ్మంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొత్తగూడెంలో 1200 వాహనాలను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి వివరాలు వెల్లడించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలనుసారం ప్రధానంగా నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై దృష్టి సారించాలని ఈ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై ప్రయాణించే వారికి అనేక నష్టాలు వాటిల్లుతున్నాయని ఈ విషయంలో ప్రయాణికులు తప్పకుండా పోలీస్ సూచనలు పాటించా లని సూచించారు. పాఠశాలలు విడిచే సమయంలో చిన్నా రులు రోడ్డు దాటుతూ ఉంటారని ఆ సమయంలో యువత విచ్చలవిడిగా అతివేగంగా వాహనాలు నడుపు తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించి అతివేగంగా వాహనాలు నడిపే వారిపై ప్రత్యేకమైన నిమా ఏర్పాటు చేశామన్నారు. నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాల్లో రద్దీ ఉన్న ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి అతిశబ్దం వస్తున్న వంద బులెట్‌లను గుర్తించామన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని , పట్టుకొని పూర్తి స్థాయిలో వాహన పత్రాలను పరిశీలించి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి నలుగురు వాహదారుల లైసెన్సులు రద్దు చేసినట్లు తెలిపారు. కొందరు నిర్లక్ష్యంగా వహించి పోలీసులు నిబంధనలను అతిక్రమిస్తూ రోడ్డు ప్రమాదాలలో వారి అమూల్యమైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంక్రైం: నెంబరు ప్లేటులేకుండా వాహనాలు నడిపితే కేసులు నరమోదుచేస్తామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని టాస్క్‌ఫోర్సు, ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన ఖమ్మంలో స్పెషల్ డ్రైవ్‌లో 55 వాహనాలు పట్టుబడ్డాయి. దీంతో వాటిని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వాహనదారులకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లయ్య, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, టాస్క్‌ఫోర్స్ సీఐ రామకృష్ణ, ఆర్ ఐ సాంబశివరావు, ఎస్ఐలు రవి, సాగర్, రాము, పాల్గొన్నారు.

# ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

- వీరిపై తెలంగాణ, ఏపీలో పలు చోట్ల కేసులు
- 48 గ్రాములు బంగారం, వాహనం స్వాదీనం
- పాల్వంచ డీఎస్పీ సతీష్‌బాబు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

అశ్వారావుపేట, అక్టోబరు 7: ఏపీ, తెలంగాణాలలో పలు స్టేషన్‌ల పరిధిలో దోపిడీ, హత్యలలో పాల్గొన్న ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను సోమవారం అరెస్ట్ చేసినట్లు పాల్వంచ డీఎస్పీ సతీష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ పట్టుబడిన దొంగలు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న 48 గ్రాముల బంగారం, వాహనాన్ని వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇటీవల అశ్వారావుపేట, దమ్మపేట మండలాలలో జరిగిన దొంగతనాలలో బాగంగా అశ్వారావుపేటలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగ ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండంతో అనుమానంతో సీఐ కరుణాకర్ వారి సిబ్బందితో కలసి వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు బచ్చు సతీష్(కృష్ణాజిల్లా, ఆకివీడు మండలం, రామచంద్రాపురం గ్రామం), ఆరెంపుల ధర్మరాజు(ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మడలం, మొద్దులపర్వ గ్రామం)కు చెందిన ఇద్దరు అంతరాష్ట్ర దొంగలుగ వీరిని విచారణలో గుర్తించినట్టు డీఎస్పీ తెలిపారు. వీరిద్దరు 2007 నుంచి ఇప్పటి వరకు ఏపీ, తెలంగాణాలలో 15కిపైగ దోపిడీలు, ఒక హత్య చేసినట్టు తేలిందన్నారు. వీరిపై తెలంగాణాలోని సత్తుపల్లి, వేంసూరు, దమ్మపేట, అశ్వారావుపేట ఏపీలోని చాట్రాయి, విసన్నపేట, రేపల్లె, నూజివీడు, మైలవరం, ఆవనిగడ్డ స్టేషన్‌ల పరిధిలో అనేక దోపిడీ కేసులు నమోదు అయ్యాయి. చాట్రాయి మండలంలో డబ్బుల కోసం ఒక వ్యక్తిని చంపి పారిపోయారన్నారు. వీరు ఈ హత్యకేసులో జైలుకు వెళ్లి కొన్నాళ్ళ క్రితం బెయిల్‌పైన బైటకు వచ్చారు. మళ్లీ దొంగతనాలు చేస్తున్నారన్నారు. అనేక దోపిడీలకు పాల్పడ్డారన్నారు. పోలీసుల విచారణలో పై ఇద్దరు వ్యక్తులు అనేక నేరాలను తామే చేసినట్టు అంగీకరించడంతో పాటు వారు దోపిడీ చేసిన మూడు తులాల బరువుకలిగిన బంగారు నానుతాడు, రెండు మంగళ సూత్రాలు, కరిగించిన 18 గ్రాముల బంగారు కడ్డీని, నారంవారిగూడెంలో వ్యక్తిపై దాడికి ఉపయోగించిన కర్ర, టార్చ్‌లైట్, రెండు మంకీ క్యాపులు, హ్యాండ్ గ్లౌజులు, హోండా యాక్టివా వాహనాన్ని, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. దొంగలను అరెస్ట్ చేసిన అశ్వారావుపేట సీఐ కరుణాకర్, ఎస్ఐ యయాతిరాజు, సిబ్బందిని అభినందిస్తున్నట్టు ఆయన తెలిపారు. వీరిద్దరి కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, ఎస్ఐ యయాతిరాజు, దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి, విజయసింహారెడ్డి, ఐడీపార్టీ హెడ్ కానిస్టేబుల్ నాగేం ద్రరావు, వెంకట్, రామారావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

- ఏరియా వైద్యశాల ఎదుట చింతగుప్ప గ్రామస్థుల ఆందోళన

భద్రాచలం, అక్టోబరు 7: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మృతి చెందిన చింతగుప్ప గ్రామానికి చెందిన గర్బిణీ ఉయికా సమ్మక్క మృతికి కారకులైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్, సీపీఎంలతో పాటు ఐద్వా మద్దతు తెలిపాయి. వైద్యశాల ప్రధాన ద్వారం వద్ద నాలుగు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. దీంతో స్పందించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆందోళనకారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే పీవో రాహుల్‌ను గ్రామస్థులు కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. దీంతో స్పందించిన పీవో మృతురాలి కుటుంబంలో భర్తకు, చెల్లెలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, రెండు సంవత్సరాల కూతురు చదువుకు సంబంధించి అన్ని బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పీహెచ్‌సీలో వైద్యుడి పోస్టు భర్తీ చేస్తామన్నారు. అలాగే దహన సంస్కారాలకు దుమ్ముగూడెం వైద్య సిబ్బంది నుంచి రూ.20 వేలు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ద్వారా రూ.10 వేలు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, ఎంబి నర్సారెడ్డి, యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న ఇజ్రాయెల్

- ఖమ్మంలో వామపక్షాల నిరసన ప్రదర్శన

ఖమ్మంటౌన్, అక్టోబరు 7: పాలస్తీనాలోని గాజాపై ఏడాదిగా యుద్ధం సాగిస్తున్న ఇజ్రాయెల్ ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్నదని వామపక్ష నేతలు పేర్కొన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు నిరసనగా సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్దనుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శ నిర్వహించారు. అంబేద్కర్‌సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద ముసుగులో ఇజ్రాయెల్ యుద్ధకాండ కొనసాగిస్తున్నదని, గాజాపై జరిపిన దాడుల్లో 50వేలమంది మరణిస్తే అందులో వృద్ధులు, పిల్లలు ఎక్కువమంది ఉన్నారన్నారు. ఇజ్రాయెల్ పశ్చిమాసియా దేశాలపై యుద్ధానికి తెగబడుతుందని, ఐక్యరాజ్యసమితి హెచ్చరించినా దాడులను ఆపడం లేదన్నారు. చమురుసంస్థలపై ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్ జరుపుతున్న దమనకాండకు అమెరికా ఆయుధాలు అందించి కుట్రకు పాల్పడుతుందని విమర్శించారు. సీపీఐ నాయకుడు బాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎన్డీ నాయకులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ సీజ్

ములకలపల్లి, అక్టోబరు7: మండలంలోని వీకే రామవరం వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ని సోమవారం ములకలపల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదచేశారు. ఉదయం సమయంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ టిప్పర్‌ను పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
మంగళవారం 8 అక్టోబరు 2024




## ఐటీడీఏలో గిరిజన దర్బార్


వినతిపత్రాలు అందజేస్తున్న గిరిజనులు

భద్రాచలం, అక్టోబరు 7: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆధ్వర్యంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. బ్యాంకు రుణాలు, ఉపాధి కల్పన, వ్యవసాయ పరికరాలు కావాలని, ఉద్యోగ శిక్షణ, భూ సమస్యలపై వినతిపత్రాలు గిరిజనులు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జునరావు, ఈఈ తానాజీ, ఎస్‌డీసీ రవీంద్రనాద్, ఏవో సున్నం రాంబాబు పాల్గొన్నారు.

## ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలి

**● మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్**

జూలూరుపాడు, అక్టోబరు7: గ్రామాలలోని ప్రజలకు సురక్షితమైన నీటిని అందించే విధంగా సహాయకులు కృషి చేయాలని మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రామీణ మంచి నీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ శివయ్య, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ హరి, ఎంపీవో తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

**● సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం సత్యనారాయణ**

మణుగూరు టౌన్, అక్టోబరు7: సింగరేణి కాలరీస్ కంపెనీ పనిచేసే అధికారులు కార్మికులు రక్షణతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి కంపెనీ డైరక్టర్ ఈఅండ్‌ఎం డి. సత్యనారాయణ తెలిపారు. సోమవారం మణుగూరు ఏరియా వర్క్‌షాపును పరిశీలించారు. అనంతరం పికే ఓసీ-2.4 గనులను వ్యూపాయింట్ ద్వారా వీక్షించారు. అనంతరం ఓసీ గనుల్లో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. యాంత్రీకరణ శక్తిని సద్వినియోగం చేసుకోవాలన్నారు కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, ఓసీ పీవో లక్ష్మీపతి గౌడ్, ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు, ప్రాజెక్టు ఇంజనీర్ వీరభద్రుడు, కేసీహెచ్‌పీ ఇంజనీర్ మాదవ్ నాయక్, ఓసీ4 మేనేజర్ రమణరావు, మణుగూరు ఓసీ మేనేజర్ రాజేశ్వరరావు, డీజీఎం ఎస్‌ఎంఎస్‌ప్లాంట్ నరసింహాస్వామి, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, ఎస్ఈ మధుసూధన్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

**● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న**

కరకగూడెం, అక్టోబరు7: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలాగా కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అశ్వాపురంపాడులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలనలో అనేకమంది ప్రజలు దరఖాస్తు చేసుకుంటే, కొంతమందికి మాత్రమే గ్యాస్ రాయితీ, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలవుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి మడివి ఉంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు, చర్ప సత్యం, కొవ్వాసీ వెంకటేష్, గంగయ్య, పొడియం ఆడమయ్య పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా గ్రామ పరిపాలన

**● టీడీపీ జిల్లా నాయకుడు ఆరెం రామయ్య**

జూలూరుపాడు, అక్టోబరు7: గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగిసి ఏడాది కావస్తుండడంతో ఎలాంటి అభివృద్ధి జరగక పాలన అస్తవ్యస్థంగా మారిందని టీడీపీ జిల్లా నాయకుడు ఆరెం రామయ్య అన్నారు. సోమవారం జూలూరుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిధులు లేకపోవడంతో గ్రామాలలో పారిశుధ్యం సమస్య తీవ్రంగా ఉందన్నారు. స్థానిక సంస్థలకు సరైన సమయంలో ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వాలు తమ ఆధిపత్యాలను ప్రదర్శిస్తూ వ్యవస్థనే నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

## మణుగూరు లారీ యజమానుల అసోసియేషన్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మణుగూరు, అక్టోబరు7: మణుగూరు లారీ యజమానుల వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా పెంట్యాల దశరథం, అధ్యక్షుడిగా మల్లెటి బాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మేరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు (ఇప్పు), ఎస్‌ఆర్‌కే రాము, సహాయ కార్యదర్శులుగా అడప స్వామి(తాతాబ్బాయి), కే. వెంకట సోములు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జే. వెంకన్న బాబు, బి.భాస్కర్, కోశాధికారిగా పిన్నపు రెడ్డి జైపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా తూపూడి గోవింద్, జీ.మురళి, గోగుల ఉప్పలయ్య, ఎం.శ్రీను, ఎన్.సంజీవరెడ్డి, ఎం.రాజు, చావా అచ్యుత్‌రావు, చిగురుపాటి నాగేశ్వరరావు, వీ.సాయి, ఆడిట్ కమిటీ సభ్యులుగా నరేష్ రెడ్డి, టి. శాంతికుమార్, రిజ్వాన్‌లు ఎన్నికయ్యారు.

## కరకగూడెంలో ఉరుములతో కూడిన వర్షం

కరకగూడెం, అక్టోబరు7: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండలంలోని వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రాణం పోసింది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో రైతులు తమ పంటలను సాగు చేసుకుంటారు.


కరకగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

## అనాథాశ్రమంలో అన్నదానం

కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు7 : కొత్తగూడెం పట్టణంలోని మునిసిపాలిటీ కార్యాలయ సమీపంలో ఉన్న జ్యోతి అనాథ ఆశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోం ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరుపేదలకు సహాయం చేస్తూ ఆదుకోవాలని కోరారు.

## వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి: సీఐ

టేకులపల్లి, అక్టోబరు 7: ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ తాటిపాముల సురేష్ కోరారు. టేకులపల్లిలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు జరిగినప్పుడు మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్‌లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది ఉన్నారు.

# వైభవంగా దేవీ శరన్నవరాత్రులు




భద్రాచలం, నడికుడి, అశ్వారావుపేటలలో వివిధ రూపాల్లో దర్శనమించిన అమ్మవారు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

### భక్తిభావం కలిగి ఉండాలి: ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, అక్టోబరు 7: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం భద్రాచలంలోని ఆదర్శనగర్ కాలనీలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుమ్ముగూడెం: దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా మండలంలోని నడికుడి శ్రీ మహంకాళి చాముండేశ్వరిదేవి అమ్మవారు సోమవారం శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, సహస్రనామం, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పర్ణశాల దేవస్థానంలోనూ శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కొత్తగూడెం సాంస్కృతికం: దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రులను కొత్తగూడెంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని త్రిమాత పంచాయతక్షేత్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా సాయినృత్యానికేతన్‌కు చెందిన సీతాప్రసాద్ కళాబృందం చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిషాసుర మర్ధిని కళానృత్యంలో చిన్నారు ప్రదర్శన పౌరాణిక ఇతివృత్తానికి అద్దంపట్టింది. అదేవిధంగా బర్మాక్యాంపు, బాబుక్యాంపు, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండల పరిధిలోని ఉత్సవ మండపాల వద్ద దేవీశరన్నరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు సోమవారం బాల త్రిపుర సుందరి అలంకరణంలో భక్తులను అలరించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీచక్రనవార్చన పూజా కార్యక్రమం జరిగింది. కొత్తమామిళ్లవారిగూడెంలో అన్నదానం నిర్వహించారు. మండలవ్యాప్తంగ అమ్మవారి మండపాలలో అమ్మవారు పలు రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

### భద్రాచలంలో ధనలక్ష్మి అలంకరణలో.....

భద్రాచలం, అక్టోబరు 7: శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న లక్ష్మీ తాయారు అమ్మవారు సోమవారం ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీ అమ్మవారి సన్నిధిలో అభిషేకం, శ్రీరామాయణ పారాయణం నిర్వహించారు. అలాగే సంక్షిప్త రామాయణ హోమం, లక్ష కుంకుమార్చన, అరణ్యకాండ పారాయణం గావించారు. ఇదిలా ఉండగా నేడు అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


మామిళ్లవారిగూడెంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


కొత్తగూడెం త్రిమాత ఆలయంలో నృత్య ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

# 'ఇజ్రాయిల్ ఘటనపై ప్రపంచ దేశాలు స్పందించాలి'

కొత్తగూడెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అగ్రదేశం అమెరికా అండతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణహోమం సృష్టిస్తోందని, దీనిపై ప్రపంచదేశాలు స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా నాయకులు ఏజే. రమేష్, సీపీఐ (ఎంఎల్) చంద్రన్నవర్గం జిల్లా నాయకుడు బాణోత్ ఊక్లా, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు గోపాలరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గౌని నాగేశ్వరరావు అన్నారు. ఇజ్రాయిల్ దుశ్చర్యలను నిరసిస్తూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ జాతీయ వామపక్ష పార్టీల పిలుపు మేరకు సోమవారం సంఘీభావ, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై అత్యంత క్రూరత్వంగా, కిరాతకంగా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందని, ఈ ఏడాది కాలంగా ఈ మారణహోమం జరుగుతున్న ప్రపంచదేశాలు నోరు మెదపకుండ అమెరికాకు భయపెడుతున్నాయని ప్రశ్నించారు. ఏడాది కాలేయం సుమారు 44వేల మంది ఇజ్రాయిల్ దాడిలో బలయ్యారని, ఆస్తులు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. సామ్రాజ్యవాద శక్తుల అండతో తమ భూభాగాన్ని ఆక్రమించి వందేళ్లుగా చిత్రహింసలకు గురి చేస్తున్న ఇజ్రాయిల్ అమానుషచర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. పాలస్తీనాపై జరుగుతున్న మారణహోమంపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసి వారికి అండగా నిలబడాలని డిమాండ్ చేశారు.


కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ఈ కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, లిక్కి బాలరాజు, కందగట్ల సురేందర్, నిమ్మల రాంబాబు, ఉమర్, కంచర్ల జమలయ్య, పూర్ణచందర్‌రావు, వాసిరెడ్డి మురళీ, రత్నకుమారి, ఫహీమ్, మాచర్ల శ్రీనివాస్, ననావత్ గోవిందు, నేరెళ్ల రమేష్, యూసుఫ్, ధర్మరాజు, భూక్యా శ్రీనివాస్, భూక్యా రమేష్, అన్నవరపు సత్యనారాయణ, నాగేశ్వరరావు, వీరన్న, లక్ష్మి, రేపాకుల శ్రీనివాస్, బాలకృష్ణ, రఘు, భూక్యా కిషన్, సర్ప కృష్ణ, సాంబ, శివం, గణేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చుంచుపల్లి, అక్టోబరు7: చుంచుపల్లి మండలంలోని పెనుగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-2010 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి స్మృతులు నెమరేసుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులు హాషం, చలపతి, విజయలక్ష్మి, మహేశ్వరి, శాంతకుమారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోక్కిలి నారాయణ రావు, పోనుగోటి శివ, శ్రీను, మహేష్, ప్రవీణ్, శ్వేత, నవ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## డోర్నాల పాపారావుకు సన్మానం

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు7: కొత్తగూడెంలోని రాజకీయాల్లో ఆరు దశాబ్దాలుగా ఎంతోమందికి రాజకీయ గురువుగా ఉంటూ పేరు పొందిన అందరి నోటా మంచి వాడిగా మన్ననలు పొందిన డోర్నాల పాపారావుకు సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఎదురుగడ్డలోని తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయాల్లో ఎటువంటి ఆరోపణలు లేని నాయకుడిగా డోర్నాల నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, పాల్గొన్నారు..


డోర్నాల పాపారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

### జయలింగేశ్వర ఆలయ చక్ర ప్రతిష్ఠకు

## ఎంపీ రఘురాంరెడ్డికి ఆహ్వానం


ఎంపీ రఘురాంరెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

దమ్మపేట, అక్టోబరు7: దమ్మపేట మండలంలో నాచారంలో వేంచేసిన జగదాంబ సమేత జయలింగేశ్వర స్వామి ఆలయానికి ఈనెల 12నజరిగే చక్ర ప్రతిష్ఠ, రాజగోపురంపైన కలశ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మువ్వా విజయ్‌బాబుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎర్రగొర్ల రాధాకృష్ణ, గుడపాటి వెంకట్రావులు వారిని కోరారు.

# సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

**● ఎంపీ రఘు రాంరెడ్డి**


బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘు రాంరెడ్డి

చుంచుపల్లి, అక్టోబరు7: సంస్కృతీ, సంప్రదాయలకు ప్రతీక బతుకమ్మ పండుగని ఎంపీ రఘు రాంరెడ్డి అన్నారు. సోమవారం విద్యానగర్‌కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ వేడుకల్లో టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, కాంగ్రెస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఊకంటి గోపాలరావు, కోనేరు సత్యనారాయణ(చిన్ని), ఆళ్ల మురళీ, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి, నాగేంద్రత్రివేంద్రి, గణేష్, గోరె బాబు తదితరులున్నారు.

కొత్తగూడెం సాంస్కృతికం: బతుకమ్మ వేడుకలను సోమవారం కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి బానుమతి, మొదటి అదనపు జ్యూడిషన్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ. సుచరిత, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పీవిడి. లక్ష్మి, లావణ్య, విశ్వశాంతి, కొత్తగూడెం బార్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, దూదిపాల రవికుమార్, నల్లమల ప్రతిభ, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. నిరంజన్‌రావు, రామిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్‌లు రాధిక, ప్రియదర్శిని తదితరులున్నారు.

ఇల్లెందు టౌన్: బతుకమ్మ వేడుకల్లో సింగరేణి ఇల్లెందు ఏరియాలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఏరియా జీఎం జాన్‌ఆనంద్ మహిళా ఉద్యోగులతో కలిసి నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో సింగరేణి అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, గిరిదరరావు పాల్గొన్నారు.


ఇల్లెందులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఇల్లెందు టౌన్: ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం బొల్లినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రొంపేడు సర్కిల్ అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మ వేడుకలను జరిపారు.

### బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలి

**● ఏరియా జీఎం దుర్గం రామచందర్**

మణుగూరు టౌన్, అక్టోబరు7: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియలో భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. సోమవారం భద్రాద్రి స్టేడియాన్ని ఏరియా అధికారులతో సందర్శించారు. అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ రమేష్, అధికారులు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, రాంగోపాల్, కృష్ణంరాజు, ఈఅండ్‌ఎం శోభన్‌బాబు, సర్వే అధికారి నబీ, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.


స్టేడియాన్ని పరిశీలిస్తున్న జీఎం రామచందర్, అధికారులు